

పుష్పాభిషేకంలో పాల్గొన్న చైర్‌పర్సన్ స్వప్న

గురుపౌర్ణమి పూజలు

గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం జిల్లాలోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్యంగా సాయిబాబా ఆలయాల్లో అభిషేకాలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయాల్లో అభిషేకం, హారతి, పల్లకీ సేవ కార్యక్రమాలు చేపట్టారు. సాయిబాబా మూల విరాట్టులను పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా సుప్రభాతసేవ, కాగడ హారతి పూజలు చేపట్టారు. అనంతరం ఆలయాల వద్ద భక్తులకు అన్నదానాలు చేశారు.

- తాండూరు, జూలై 21



ఘనంగా పెరుగు బసంతం

అనంతగిరి శ్రీ అనంతపద్మనాభ స్వామి దేవాలయంలో ఆదివారం పెరుగు బసంతంతో ఆషాఢ మాస చిన్న జాతర ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ వేడుకను చూసేందుకు వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ప్రసాదం కోసం భక్తులు పోటీ పడ్డారు. ప్రసాదాన్ని పొలాల్లో చల్లుకుంటే పంటలు బాగా పండుతాయని ఈ ప్రాంత ప్రజలు విశ్వసిస్తారు. అంతకు ముందు అనంతుడి పల్లకీ సేవ నిర్వహించారు. అయితే వికారాబాద్‌లో మూడు రోజులుగా ముసురు వర్షం వీడడం లేదు. అనంతగిరి జాతర సందర్భంగా ఆలయానికి వెళ్లిన భక్తులు వర్షంలో తడుస్తూనే దర్శనాలు చేసుకున్నారు.

- వికారాబాద్, జూలై 21



నిధులొచ్చాయ్

- పంచాయతీ కార్మికులకు బకాయి వేతనాలు విడుదల
- జిల్లాకు 69.92 లక్షలు మంజూరు



మేడ్చల్ జూలై 21(ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ కార్మికుల బకాయి వేతనాలకు మోక్షం లభించింది. కార్మికుల నిరీక్షణకు తెరదించుతూ రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. మేడ్చల్ జిల్లాలో 184 మంది కార్మికులకు రూ. 69.92 లక్షలు విడుదల చేస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని నెలలుగా పంచాయతీ కార్మికులకు వేతనాలు అందడం లేదు. పెద్ద గ్రామాల్లో ఇతర ఆదాయ మార్గాల ద్వారా కొన్ని నెలల పాటు చెల్లించారు. కానీ చిన్న పంచాయతీల్లో సాధ్యం కాలేదు. దీనితో కార్మికులు కుటుంబాన్ని పోషించుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల నిరసనలు తెలిపారు.

బ్యాంకు ఖాతాల్లో జమ.

పంచాయతీల్లో నిధులు లేకపోవడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సైతం నిధులు విడుదల చేయకపోవడంతో ఈ సమస్య పంచాయతీ కార్యదర్శులకు కొన్ని నెలలుగా తలనొప్పిగా మారింది. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించడంతో కొంత ఉపశమనం లభించింది. తాజాగా విడుదల చేసిన నిధులను కార్మికుల వేతనాలకు చెల్లించాలంటూ జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు కార్మికుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. మరో నాలుగైదు రోజుల్లో జమకానున్నాయి.

అత్యవసరమైతే 100కు కాల్ చేయాలి

వికారాబాద్, జూలై 21 : భారీ వర్షాల సందర్భంగా ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100కు గానీ, పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670056 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, పొలాల వద్ద రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు దాటే ప్రయత్నం చేయకూడదన్నారు.

రెవెన్యూలో భారీగా బదిలీలు



- 7 తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల ట్రాన్స్‌ఫర్
- భారీ సంఖ్యలో సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం

అడుగుకో గుంత!

ప్రయాణం నరకప్రాయం

- చిన్న వర్షానికే రోడ్లన్నీ ధ్వంసం
- గుంతలమయంగా మారిన హైవే, ప్రధాన, గ్రామీణ రోడ్లు
- ఇంటికి చేరేంత వరకు దేవుడే దిక్కు
- పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో ప్రయాణికులు

జిల్లాలో ఓ వైపు కంకర తేలిన రోడ్లు.. మరో వైపు గుంతలు.. ఇంకోవైపు బురద రోడ్లతో జనం ఇబ్బందులు పడుతున్నారు. పల్లె, పట్నం అనే తేడా లేదు. రెండు మూడు రోజులుగా కురుస్తున్న వానలకు చిన్నరోడ్లు, పెద్ద రహదారులు అన్నీ అడుగడుగునా గుంతలతో ప్రమాదకరంగా మారాయి. గతంలో పల్లె, పట్టణ ప్రగతి అంటూ కార్యక్రమాలు నిర్వహించినా.. రోడ్ల పరిస్థితిలో మార్పు కన్పించలేదు. వాహనదారులకు గతుకుల రోడ్లపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఇవే రోడ్లపై ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు వెళ్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు. ద్విచక్రవాహనంపై వెళ్లే వారు తాము ఇంటికి చేరేంత వరకు భగవంతుడిపై భారం వేసి ప్రయాణిస్తున్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి.



గుంతలమయంగా తాండూరు - చించోలి రోడ్డు

వికారాబాద్(ఆంధ్రజ్యోతి)/ధారూరు/వికారాబాద్/బొంరాస్‌పేట, జూలై 21 : జిల్లాలో చిన్న వర్షాలకే రోడ్లన్నీ ధ్వంసం కావడంతో ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. వాహనం నడిపించేప్పుడు ఏమాత్రం ఏమరుపాటుతో వ్యవహరించినా ప్రమాదం బారిన పడక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. వాహనాల రద్దీ అధికంగా ఉండే వికారాబాద్ - తాండూరు, వికారాబాద్ - సదాశివపేట్, తాండూరు - కోట్‌పల్లి - మోమిన్‌పేట్, వికారాబాద్ - మన్నేగూడ తదితర మార్గాల్లో రోడ్లపై పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. రోడ్లపైన ఏర్పడ్డ గుంతలను తప్పించుకుంటూ నడిపించడం వాహనదారులకు సవాల్‌గా మారింది. పగటి వేళలో ఈ పరిస్థితి ఉంటే రాత్రివేళలో వాహనం నడిపించే వాహనదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. రోడ్లపై ఏర్పడ్డ గుంతలతో ప్రమాదాల బారిన పడి వాహనదారులు మృత్యువాత పడుతున్నా ఆర్‌అండ్‌బీ అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. వర్షాలు కురియక ముందే రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకుని ఉంటే కొంత వరకైనా వాహనదారులకు ఇబ్బందులు తప్పేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



గుంతల్లో వర్షపు నీరు నిలిచిన దోర్నాల్-అంపల్లి రోడ్డు

ప్రధాన మార్గాల్లో రోడ్లు గుంతలమయంగా మారడంతో వాహనదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రాత్రివేళలో ద్విచక్రవాహనంపై వెళ్లే వారు తాము ఇంటికి చేరేంత వరకు భగవంతుడిపై భారం వేసి ప్రయాణిస్తున్నారంటే అతిశయోక్తి కాదనే చెప్పాలి. గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతూ వాహనదారులు ప్రాణాలు కోల్పోతున్నారు. రోడ్డుపై ఏర్పడ్డ గుంతలతో వాహనం నియంత్రణ తప్పి జరిగే ప్రమాదాల్లో వారానికి అయిదారు మంది మృత్యువాత పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి గుంతలమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గుంతలు పడి పాడైన దోర్నాల్ దారి

ధారూరు : మండల పరిధిలోని దోర్నాల్ నుంచి అంపల్లి గేట్ వరకు ఉన్న తారు (బీటీ) రోడ్డు గుంతలు పడి పాడై వాహనాల రాకపోకలకు కష్టంగా మారింది. ఈ రోడ్డు ఇరువైపుల గుంతలు పడి, తారు లేచిపోయి కంకర తేలి గుంతలమయంగా మారింది. చాలకాలంగా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవటంతో క్రమంగా బీటీ రోడ్డు దెబ్బతిన్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డు పై ఉన్న గుంతలలో నీరు నిలిచి మడుగులుగా మారడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దోర్నాల నుంచి అంపల్లి గేట్ వరకు రోడ్డు పూర్తిగా పాడై వాహనదారులకు ప్రమాదరకరంగా మారింది. దెబ్బతిన్న ఈ రోడ్డును మరమ్మతులు చేసేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



బొంరాస్‌పేట్ - మెట్లకుంట రోడ్డు

వదలని ముసురు

మూడు రోజులుగా కురిస్తున్న ముసురుతో వ్యవసాయ పనులు స్తంభించిపోయాయి. పొలాలు బురదగా మారటంతో రైతులు ఇంటి వద్దనే ఉంటున్నారు. కలుపు పనులు ముందుకు సాగడం లేదు. ముసురు వాన ఇలాగే కొనసాగితే పంట మొక్కలు ఎర్రబారి చనిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో ముసురు వర్షం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆదివారం ఓ మోస్తరు వర్షం కురిసింది. రాత్రి 9గంటల వరకు అత్యధికంగా మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా బండమాదారంలో 11.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. హైదర్‌నగర్‌లో 9.5మి.మీ., కొండాపూర్‌లో 8.8 మి.మీ., సింగపూర్ టౌన్‌షిప్‌లో 8.5 మి.మీ., శంషీగూడలో 8.0 మి.మీ., మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 7.8 మి.మీ., దమ్మాయిగూడలో 6.0మి.మీ., మూడుచింతలపల్లిలో 1.8 మి.మీ., వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో 10.3 మి.మీ., వర్షం కురియగా, కందుకూరులో 9.0మి.మీ., రాజేంద్రనగర్‌లో 8.8మి.మీ., కేశంపేట్‌లో 8.0 మి.మీ., యాచారంలో 8.0 మి.మీ., మొయినాబాద్‌లో 8.0 మి.మీ., మహేశ్వరంలో 6.3మి.మీ., కొత్తూరులో 6.0 మి.మీ., షాద్‌నగర్‌లో 6.0మి.మీ., నందిగామలో 5.8మి.మీ., షాబాద్‌లో 5.5 మి.మీ., చేవెళ్లలో 5.5మి.మీ., మంచాల్‌లో 5.0 మి.మీ., తలకొండపల్లిలో 4.3 మి.మీ., మాడ్గుల్‌లో 2.8 మి.మీ., ఆమన్‌గల్‌లో 2.8మి.మీ., ఇబ్రహీంపట్నంలో 2.5 మి.మీ వర్షం కురిసింది. వికారాబాద్ జిల్లాలో పూడూరులో 8.0 మి.మీ., వర్షం కురియగా, మర్పల్లిలో 7.3 మి.మీ., కోట్‌పల్లిలో 7.3మి.మీ., వికారాబాద్‌లో 7.0 మి.మీ., ధారూరులో 7.0 మి.మీ., నవాబ్‌పేట్‌లో 7.0 మి.మీ., బంట్వారంలో 6.8 మి.మీ., పెద్దేముల్‌లో 6.0 మి.మీ., తాండూరులో 5.5 మి.మీ., పరిగిలో 3.5 మి.మీ., కులకచర్లలో 3.0 మి.మీ., దోమలో 2.3 మి.మీ., యాలాల్‌లో 2.0 మి.మీ., యాలాల్‌లో 1.5 మి.మీ, బొంరాస్‌పేట్‌లో 1.5 మి.మీ., బషీరాబాద్‌లో 1.0 మి.మీ వర్షం కురిసింది.

యథేచ్ఛగా

మట్టి తవ్వకాలు

ప్రభుత్వ భూమిలో రాత్రికిరాత్రే తవ్వకాలు.. తరలింపు

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- సర్కారు ఆదాయానికి గండి



అవుశాపూర్‌లోని సర్వేనంబరు 96 ప్రభుత్వ భూమిలో మట్టితవ్వకాలు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 21: ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు యథేచ్ఛగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. అనుమతులు లేకుండా రాత్రికిరాత్రే సర్కారు భూముల్లో తవ్వకాలు చేపట్టి మట్టిని విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇంతతతంగం జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడంపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘట్‌కేసర్ మండలంలోని అవుశాపూర్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 96లో 5ఎకరాల ప్రభుత్వభూమి ఉంది. అందులోని ఎకరం భూమిలో కొంతమంది మట్టి వ్యాపారులు తవ్వకావలు చేపట్టి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. గతంలో ఇదే భూమిలో నుంచి ఓ రియల్ వ్యాపార సంస్థ వెంచర్ కోసం ఏకంగా రోడ్డును ఏర్పాటు చేయగా, ప్రస్తుతం అక్రమంగా మట్టి త్వవ్వకాలు చేపట్టి ఆక్రమించేందుకు పావులు కదుపుతున్నారు. అలాగే కొర్రెముల రెవెన్యూ పరిధి సర్వే నెంబర్లు 368, 369లోని ప్రభుత్వ భూమిలో జోరుగా మట్టి తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారు. సెలవు రోజుల్లో ఎక్కువగా హిటాచీలతో మట్టి తవ్వకాలు చేపట్టి టిప్పర్లతో మట్టిని నగరానికి తరలిస్తున్నారు. విలువైన ప్రభుత్వ భూముల్లో నుంచి ప్రైవేటు వెంచర్ల కోసం దారులు వేసుకుంటున్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. ఇంతతతంగం జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైన రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూము ల్లో నుంచి మట్టి తవ్వకాలు నిలిపివేయాలని, తవ్వకాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

కొర్రెములలోని సర్వేనంబరు 368, 369లో మట్టి తవ్వకాలు



ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపడితే చర్యలు

అవుశాపూర్ రెవెన్యూ పరిధి సర్వేనెంబర్ 96లోని ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేపట్టినట్లు తెలిసింది, వెంటనే సిబ్బందిని పంపించి మట్టితవ్వకాలను నిలిపివేశాం. సర్వేచేయించి ఒకవేళ ప్రభుత్వ భూమిలోకి తవ్వకాలు చేపట్టినట్లైతే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. అలాగే కొర్రెములలోని సర్వేనెంబర్ 368, 369లలో మట్టి తవ్వకాలను నిలిపివేశాం. ప్రభుత్వ భూముల్లో మట్టి తవ్వకాలు చేపట్టిన, కబ్జాలకు యత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు.

- డీఎస్ రజిని, తహసీల్దారు, ఘట్‌కేసర్

బోనం.. సంబురం

- అమ్మవార్లకు నైవేద్యం సమర్పించిన భక్తులు
- మైసమ్మకు బోనమెత్తిన మల్కాపూర్
- ఉట్టిపడిన పండుగ శోభ



మేడ్చల్‌లో ఫలహారబండి ఊరేగింపులో ఎమ్మెల్యే మల్లారెడ్డి డ్యాన్స్



మేడ్చల్ జూలై 21(ఆంధ్రజ్యోతి)/తాండూరు రూరల్, జూలై 21 : ఆషాఢ మాసం సందర్భంగా తాండూరు మండలం మల్కాపూర్ గ్రామంలో ఆదివారం మైసమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి, పండరి ఆధ్వర్యంలో ఉదయం నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు, డప్పుచప్పుల్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. మాజీ ఎంపీటీసీ రవిసింధే, కాంగ్రెస్ నాయకులు వడ్ల మల్లేశం, గని కార్మిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు ఎస్.పండరి, నాయకులు శ్రీశైలం, కిష్టప్ప, మేడికొండ వెంకటయ్య, మాజీ ఉపసర్పంచ్ కాశీనాథ్, వెంకటి, శ్రీశైలం, కిష్టప్ప, మైనుద్దీన్, అల్లావుద్దీన్, చాకలి మొగులప్ప, కుర్వ భీమయ్య, దోమ మల్లప్ప, ఆనంద్‌కుమార్, రాయిచూర్ శివప్ప పాల్గొన్నారు. అలాగే బోనాల పండుగ ఉత్సవాలు మేడ్చల్ జిల్లాలోని పలు మండలాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్‌లోని ఏడుగుళ్ల, అత్వెల్లి పోచమ్మ దేవాలయం, గుండ్లపోచంపల్లిలోని దుర్గమ్మ ఆలయం, ఘట్‌కేసర్‌లోని పలు అమ్మవార్ల ఆలయాల వద్ద భక్తులు బారులు తీరారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఫలహార బండ్ల ఊరేగింపు కార్యక్రమాల వద్ద ఆయా పార్టీల నాయకులు హాజరుకాగా, మేడ్చల్‌లోని ఏడుగుళ్ల ఆలయం వద్ద ఫలహార బండి ఊరేగింపులో ఎమ్మెల్యే చిందులేశారు.



మల్కాపూర్‌లో ఆలయం చుట్టూ బోనాలతో ప్రదక్షిణలు

ముదిరాజ్‌లను తక్షణమే బీసీ-ఏలో చేర్చాలి



వికారాబాద్: స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వికారాబాద్, జూలై 21: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అభయహస్తం మ్యానిఫెస్టోలో భాగంగా బీసీ డిక్లరేషన్‌లో వాగ్దానం చేసిన విధంగా జీవోనెంబర్ 15, 19 ఫిబ్రవరి 2009 పునరుద్ధరించాలని, ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ-డీ గ్రూపు నుంచి బీసీ-ఏ గ్రూపు మార్పునకు కట్టుబడి అతి త్వరగా పరిష్కరించాలని జిల్లా ముదిరాజ్ నాయకులు కోరారు. ఆదివారం స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో అధిక జనాభా గలముదిరాజ్‌లు సమాజంలో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నామని అన్నారు. అందుకు స్పీకర్ సానుకూలంగా స్పందిస్తూ సీఎం దృష్టికి తీసుకెళ్లి అసెంబ్లీలో ప్రస్తావించి పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గొట్టిముక్క శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్కోడ నర్సింహులు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ బస్వాపురం, రాములు, జిల్లా జాయింట్ సెక్రటరీ సిద్దులూరు కృష్ణ, కోట్‌పల్లి మండల జనరల్ సెక్రటరీ మందుల శ్రీనివాస్, ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దేముల్: ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షుడు లొంక నర్సింహులు ఆసంఘ నాయకులతో కలిసివెళ్లి ప్రజాప్రతినిధులను కోరారు. వికారాబాద్ జిల్లా ముదిరాజ్ సంఘం ఆధ్వర్యాన ఆదివారం అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జిల్లా మత్స్యకార చైర్మన్ శ్రీధర్, శాఖం రాములు, యాలాల, తాండూరు పట్టణ అధ్యక్షులు హన్మంతు, శ్రీకాంత్, టి.తిరుపతి, లొంకరాములు, జగదీష్, బంధ్యప్ప తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శిథిలావస్థలో మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం

● రికార్డు సెక్షన్‌లోకి వర్షపు నీరు ● తడిసిన భూ రికార్డులు



మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం

మర్పల్లి, జూలై 21: మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థలో ఉండటంతో రికార్డు సెక్షన్ గదిలో వర్షపు నీరు కురుస్తుండటంతో పురాతన రికార్డులు తడిసిపోతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యవసాయ భూములకు డిమాండ్ పెరగడంతో రైతులు, ప్రజలు ప్రతీరోజు భూ రికార్డుల కోసం కార్యాలయానికి వస్తున్నారు. రాతపూర్వకం నుంచి ఆన్‌లైన్‌లో భూ రికార్డులను నమోదు చేసినా పాత రికార్డులు మాత్రం రాతపూర్వకంగా జారీ చేస్తున్నారు. భూ వివాదాల్లో కోర్టులో ఫిర్యాదు చేయాలన్నా, పాసుపుస్తకాల్లో నుంచి భూ వివరాలు తప్పుగా నమోదైనా తప్పనిసరిగా పాత రికార్డులు అందించాల్సి ఉంటుంది. 1955 నుంచి 2016 వరకు భూ రికార్డులన్నీ రాతపూర్వకంగానే జారీ చేయడంతో పాత రికార్డులు తడిసిపోతున్నాయి. పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో నమోదు చేయలేమని, దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ పాత పహణీలు జిరాక్స్ తీసి ఇస్తున్నామని, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో రికార్డులు తడిసిపోతున్నాయని అధికారులు తెలిపారు. దీంతో రైతులకు భూ వివరాలు అందించేందుకు ఇబ్బందులు ఏర్పడతాయని వాపోతున్నారు. కార్యాలయం శిథిలావస్థలో ఉండటంతో ఎప్పుడు కూలిపోతుందోననే భయంతో విధులు నిర్వహిస్తున్నామని అధికారులు తెలిపారు. రికార్డు సెక్షన్‌లో వర్షపు నీరు చేరడంతో రికార్డులపై తాడిపత్రులు కప్పుతూ కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. రికార్డులు పూర్తిగా తడిసిపోకముందే చర్యలు తీసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



మర్పల్లి తహసీల్దార్ కార్యాలయంలో వర్షానికి తడిసిన రెవెన్యూ రికార్డులు

బదిలీల ప్రక్రియ పొడిగింపు

● 31 వరకు ట్రాన్స్‌ఫర్లు ● స్పష్టత లేని అర్డర్

తాండూరు, జూలై 21: ఉద్యోగుల సాధారణ బదిలీల గడువును సర్కార్ పొడిగించింది. ఈ మేరకు శనివారం రాత్రి ఉత్తర్వులు ఒకే చేసింది. ఈనెల 20వ తేదీ వరకు బదిలీల ప్రక్రియ కొనసాగింది. నిషేదం మళ్లీ ఈనెల 21 (ఆదివారం) నుంచి అమలులోకి రావాల్సి ఉండగా తెలంగాణ సర్కార్ ఈనెల 31వ తేదీ వరకు చేపట్టిన బదిలీ ప్రక్రియ గందరగోళంగా మారిందని, మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రక్రియ జరుగలేదంటూ వివిధ విభాగాల ఉద్యోగుల ఆరోపణలతో బదిలీలు కొలిక్కిరాలేదు. దీంతో ప్రభుత్వం బదిలీ ప్రక్రియను ఈనెలాఖరు వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఆగస్టు 1వ తేదీ నుంచి బదిలీల ప్రక్రియను నిలిపివేస్తూ నిషేదం అమల్లోకి తేవనున్నట్లు ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. ఖాళీల వివరాలు సక్రమంగా చూపడడం లేదని, 40శాతం ప్రక్రియ సరిగ్గా జరగలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పైరవీలకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా చేపట్టాలని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. ఉద్యోగ సంఘాల నేతలకు యథాస్థానంలో ఉంచరాదని, కేటాయింపులో ప్రాధాన్యతను ఇవ్వాలే తప్పా యూనియన్ లీడర్‌గా మళ్లీ యథాస్థానంలో ఉంచడంపై విమర్శలు వస్తున్నాయి.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ప్రిన్సిపాల్‌కు స్థానం

కొడంగల్, జూలై 21: వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ నరేశ్‌రాజ్ స్థానం దక్కించుకున్నారు. గురుపూజోత్సవంలో భాగంగా ఆదివారం ఆన్‌లైన్‌లో వర్తి వెల్నెస్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో విశ్వరత్న అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నత చదువుతో పాటు ఎన్నో అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్న తనకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తన తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకున్నారు. నరేశ్‌రాజ్‌కు విశ్వరత్న అవార్డు అందుకోవడంతో స్నేహితులు, కుటుంబసభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



తల్లిదండ్రులతో అవార్డు అందుకున్న నరేశ్‌రాజ్

మోత్కూర్ వాసికి రెండు ప్రభుత్వ ఉద్యోగాలు

దోమ, జూలై 21: మండలంలోని మోత్కూర్ గ్రామానికి చెందిన రవికుమార్ రెండు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన గురుకుల పాఠశాలల పరీక్షా ఫలితాల్లో టీజీడీ, పీజీటీ ఉద్యోగాలు సాధించారు. మహాత్మా జ్యోతిబా పూలే పరిగిలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరారు. రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడం పట్ల కుటుంబసభ్యులు, గ్రామస్తులు రవికుమార్‌ను అభినందించారు.



రవికుమార్



గురుపూజోత్సవంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

తెలంగాణ ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిది

» తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

ఘట్‌కేసర్, జూలై 21: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని తెలంగాణ రాష్ట్ర జేఏసీ చైర్మన్, జన సమితి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకోవడానికి తొలిదశ, మలిదశ ఉద్యమాల్లో ఉపాధ్యాయుల కృషి ఎంతో ఉందన్నారు. ఈ ఉద్యమంలో ఆయా రంగాలకు చెందిన వారు ఎంతో క్రియాశీలకంగా పని చేసినప్పటికీ గురువులు ఉద్యమానికి వెన్నుదన్నుగా పని చేశారని గుర్తుచేశారు. గురుపూర్ణిమ సందర్భంగా గురువులను సన్మానించే కార్యక్రమాన్ని నిర్వహించిన సంస్కృతి టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌రెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడు బెజ్జంకి హరిప్రసాదరావు, పలువురు ఉపాధ్యాయులు, స్థానికులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

ఆమనగల్లు, జూలై 21: గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతన రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆమనగల్లు సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య డిమాండ్ చేశారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఆదివారం నిర్వహించిన సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాలకు చెందిన పారిశుద్య కార్మికులు, సిబ్బంది పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. డిమాండ్ల సాధనకు ఈనెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పెంటయ్య తెలిపారు. గ్రామం పంచాయతీల్లో మల్టిపర్పస్ వ్యవస్థను రద్దు చేయాలని, సిబ్బంది డ్రెస్సులు, సబ్బులు, నూనెలు అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆమనగల్లు మండలాధ్యక్షుడు పాండు, ప్రధాన కార్యదర్శి పర్వతాలు, కడ్తాల మండలాధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం, తలకొండపల్లి మండలాధ్యక్షుడు జంగయ్య, కార్యదర్శి శివలీల, కోశాధికారి లక్ష్మణ్ పాల్గొన్నారు.

బోనాలకు 'తొట్టెలు' సిద్ధం



తొట్టెల తయారీలో నిమగ్నమైన రవి రాజు

మొయినాబాద్ రూరల్, జూలై 21: ఆషాఢ మాసంలో బోనాలు అంగరంగవైభవంగా నిర్వహిస్తారు. ఎక్కడ చూసినా పండుగ వాతవరణం నెలకొంటుంది. నగర శివారు చేవెళ్ల నియోజకవర్గంలోని గ్రామాల్లో నిర్వహించే బోనాల సందర్భంగా యువత తొట్టెలను ఊరేగింపుగా తీసుకువెళ్లి గ్రామదేవతలకు సమర్పించడం ఆనవాయితీ. కాగా, బండ్లగూడ జాగీర్ కిస్మత్‌పూర్ నుంచి మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామానికి పదేళ్ల క్రితం కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన రవిరాజు తొట్టెలను తయారు చేస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తమకు ఇదే వ్యాపారమని, బోనాలు వస్తేనే కుటుంబం ఆర్థికంగా నిలదొక్కుకునే పరిస్థితి ఉంటుందని తెలిపాడు. ఈ ఏడాది అంతంత మాత్రమే గిరాకీ ఉందని, ఎవరూ ఆర్డర్లు ఇవ్వడంలేదని చెప్పాడు.



వైద్య శిబిరంలో పాల్గొన్న మాజీ సర్పంచ్ రాజు, వైద్యులు

వైద్య శిబిరానికి విశేష స్పందన

మొయినాబాద్ రూరల్, జూలై 21 : ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అప్పోజిగూడ గ్రామ మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అప్పోజిగూడ గ్రామంలో నగరంలోని కామినేని ఆసుపత్రి వారు ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. గ్రామంలోని 80 మందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఆసుపత్రి యాజమాన్యానికి రాజు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు సంతోష్, నందు, శిబిరం కోఆర్డినేటర్ శ్రీధర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పు



పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూలై 21: జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని నాయకులు అన్నారు. జ్ఞాన మాల 29వ వారం కార్యక్రమంలో భాగంగా ఈ రోజు ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని మల్లేపోగు మల్లేశ్, ప్రవీణ్‌లు పేర్కొన్నారు. జ్ఞానం ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, సమాజ శ్రేయస్సుకు ప్రతీఒక్కరు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జంతుక శంకర్, కుమార్ పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఘట్‌కేసర్, జూలై21: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, వెంకటసాయినగర్ కాలనీల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటసాయినగర్‌లో రూ, 20లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. అన్ని కాలనీల్లో డ్రైనేజీలు, సీసీ, బీటీరోడ్ల పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. వీధుల్లో చెత్త వేయొద్దని, పరిసరాలను కలుషితం చేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు రాష్ట్రస్థాయి అవార్డులు

ఆమనగల్లు, జూలై 21: సామాజిక సేవా కార్యక్రమాల నిర్వహణలో ఆమనగల్లు లయన్స్‌క్లబ్ 2023-24 సంవత్సరానికి గాను రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికైంది. లయన్స్‌క్లబ్ జిల్లా 320-ఏలో 12 అవార్డులు దక్కించుకుంది. గ్రామీణ క్లబ్‌లలో అగ్రస్థానంలో నిలిచింది. చేపట్టిన సేవా కార్యక్రమాలకు క్లబ్‌లో అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంది. ఆదివారం సికింద్రాబాద్ బాటియాగార్డెన్‌లో లయన్స్‌క్లబ్ ప్రతిభా అవార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ హరినారాయణ బట్టడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రంలోని వివిధ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్ బృందానికి బెస్ట్ క్లబ్, బెస్ట్ బ్యానర్ అవార్డులను ప్రదానం చేశారు. అత్యుత్తమ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, అత్యుత్తమ పీఆర్‌వోగా ఎంఏ పాషాలు అవార్డులు అందుకున్నారు. మీల్స్ అండ్ వీల్స్ కార్యక్రమం నిర్వహణకు గాను చుక్కాపూర్ గ్రామానికి చెందిన జోన్ చైర్మన్ ఎ.శేఖర్‌రెడ్డికి, ఉచిత కంటి వైద్యశిబిరాలను సమర్థవంతంగా నిర్వహించిన ఎం.చంద్రశేఖర్‌కు, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్న జిల్లా చైర్మన్లు అంజయ్య, రాంచంద్రారెడ్డి, సామాజిక సేవలను లయన్స్‌క్లబ్‌ను రాష్ట్రస్థాయిలో అగ్రభాగాన నిలిపిన లయన్స్‌క్లబ్ మాజీ గవర్నర్లు చెన్నకిషన్ రెడ్డి, రమేశ్ బాబు, నరేందర్ రెడ్డిలను అభినందించి అవార్డులు ప్రదానం చేశారు. సేవా కార్యక్రమంలో, క్లబ్ అత్యుత్తమ క్లబ్‌గా ఎంపికకు సహకరించిన సభ్యులకు, అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారి కొరివి వెంకటయ్యలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, జోన్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, జిల్లా చైర్మన్లు జూలూరి రమేశ్, ఓంకారం, కసిరెడ్డి రాంరెడ్డి, అంజయ్య, అర్థం మనోహర్, భిక్షపతి, సుధీర్‌రెడ్డి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.



అవార్డులు అందుకుంటున్న లయన్స్‌క్లబ్ బృందం

రెవెన్యూలో భారీగా బదిలీలు



» తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల బదిలీ

వికారాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ శాఖలో భారీ సంఖ్యలో బదిలీలు నిర్వహించారు. పది మంది తహసీల్దార్లు, పది మంది నాయబ్ తహసీల్దార్లు, భారీ సంఖ్యలో సీనియర్ అసిస్టెంట్లను బదిలీ చేస్తూ చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ (సీసీఎల్ఏ) నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు. కలెక్టరేట్ ఏవో జి.అమరేందర్ కృష్ణను నారాయణపేట జిల్లాకు బదిలీ చేయగా, బంట్వారం తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్‌ను హైదరాబాద్‌కు, పూడూరు తహసీల్దార్ యు.రమాదేవి, కోట్‌పల్లి తహసీల్దార్ పి.ఆశాజ్యోతి, కలెక్టరేట్‌లో సెక్షన్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కె.శివశ్రీనివాస్‌లను సంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వి.లావణ్యను యాదాద్రి భువనగిరి జిల్లాకు బదిలీ చేయగా, బి.విజయకుమార్, ఎస్.పురుషోత్తం, కె.శ్రీనివాస్, ఎస్.సంధ్య, వై.వెంకటేష్‌లను తిరిగి ఇక్కడే కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వీరి స్థానంలో హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఫర్హీన్‌ఖాటూన్, సెబాసుల్తానాలను జిల్లాకు కేటాయించారు. జనగాం జిల్లా నుంచి సి.అంజయ్య, నారాయణపేట్ నుంచి నియామత్ అలీ, మహబూబ్‌నగర్ జిల్లా నుంచి భరత్‌గౌడ్, వనపర్తి జిల్లా నుంచి జి.బాల్‌రెడ్డి బదిలీపై వికారాబాద్ జిల్లాకు రానున్నారు. నాయబ్ తహసీల్దార్లలో కె.రవి, లక్ష్మణ్, పి.కిరణ్‌కుమార్, కె.రమేష్‌కుమార్, వి.విజయ్, ఉప్పు రమేష్, టి.వెంకటయ్య, ఎ.రాజేష్‌లను హైదరాబాద్ జిల్లాకు బదిలీ చేయగా, సీహెచ్ఎస్ మల్లికార్జునరావును మేడ్చల్ మల్కాజ్‌గిరి, టి.రాజేందర్ రెడ్డిని రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేశారు. వీరి స్థానంలో హైదరాబాద్ నుంచి షేక్ రషీద్ అహమ్మద్, మహమ్మద్ యూనస్, బండారు శ్రీనివాస్, కె.అజయ్‌కుమార్, పి.దీపక్‌రావు, చంద్రశేఖర్, ఎస్.నవీన్‌కుమార్, జిల్లపల్లి సందీప్, హెచ్.రాకేష్‌కుమార్, ఎం.నరేష్‌గౌడ్, కిరణ్ కుమార్‌లను జిల్లాకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీనియర్ అసిస్టెంట్ల బదిలీలు...


జిల్లాలోవిధులు నిర్వహిస్తున్న సీనియర్ అసిస్టెంట్లలో చాలా వరకు అందరినీ హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. పి.నారాయణరెడ్డి, ఎస్.వి జయభాస్కర్, వి.మోహన్, రాజురెడ్డి చర్ల, ఎన్.తులసీరాం, ఎస్.వెంకటగిరి, బి.మమత, నల్లోళ్ల రాజు, సి.రవీందర్‌రెడ్డి, కేటావత్ రాజేందర్, పి.శ్రీకాంత్, శృతి, గిరిధర్ గోపాల్, బాలయ్య, పి.కరుణాకర్, ఎం.బాల మహేశ్వర్‌రావు, జె.దశరథ్‌సింగ్, సర్వే వివేకాందరావు, బి.రాకేష్, ఎస్.శివప్రసాద్, ఎ.సుశీల్ సాయికుమార్, బి.చంద్రమోహన్‌లను హైదరాబాద్‌కు బదిలీ చేశారు. రాజు, నీరటి రమేష్‌లను రంగారెడ్డి జిల్లాకు బదిలీ చేయగా, ఊట్కూరి శివానిని సంగారెడ్డి జిల్లాకు కేటాయించారు. జిల్లా నుంచి బదిలీ అయిన సీనియర్ అసిస్టెంట్ల స్థానంలో చాలా వరకు హైదరాబాద్ నుంచి జిల్లాకు రానున్నారు. పి.మోహన్‌రావు, ఎన్.శివకుమార్, టీ సీహెచ్ స్రిమిన్ షఫేలీ, ఎం.పింకీ ఫ్లోరా, కె.నారాయణరెడ్డి, కొత్తపల్లి శ్రీకాంత్, పీవీఎల్ కిరణ్‌కుమార్, సి.వంశీకృష్ణ, జె.హరీష, సెల్వనైగాం ఫ్రాన్సిస్, జె.ప్రదీప్‌కుమార్, బి.అశ్విని సాయిలీలా, ఫర్హా మహమూద్, బి.సునీల్ కుమార్, ఎం.రిచర్డ్ సైమన్, కప్పు సవిత, టి.రాజు, ఆర్.సంజయ్‌కుమార్, మహమూద్ ఓవైసీ అలీ, పి.విష్ణువందన, కమలాకుమారిలను హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాకు కేటాయించారు.

బదిలీలపై అసహనం...

గతంలో ఎన్నడూ లేని విధంగా రెవెన్యూ శాఖలో విధులు నిర్వహిస్తున్న కిందిస్థాయి ఉద్యోగులను బదిలీచేయడం చర్చనీయాంశంగా మారింది. రెవెన్యూ శాఖలో ముఖ్యంగా భూ వివాదాలు, సమస్యలపై నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లకు క్షేత్రస్థాయి అనుభవం ఉంటుంది. జిల్లాలో పనిచేస్తున్న నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లను చాలా వరకు బదిలీ చేయడంతో వారి స్థానంలో ఎక్కువగా ఇక్కడకు హైదరాబాద్ నుంచి బదిలీ చేశారు. వచ్చే రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు స్థానిక సమస్యలను అవగాహన చేసుకుని సమస్యలపై దృష్టి సారించే వరకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉండవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ప్రాధాన్యతాప్రకారం తాము కోరుకున్న స్థానాలను కాకుండా ఉన్నతాధికారుల నిర్ణయాధికారం మేరకే బదిలీలు చేశారంటూ పలువురు నాయబ్ తహసీల్దార్లు, సీనియర్ అసిస్టెంట్లు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తమ ఇష్టానుసారంగా కాకుండా మ్యాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి ఉంటే తమకు అనుకూలంగా ఉండే జిల్లాలను ఎంపిక చేసుకుని ఉండేవారమని చెబుతున్నారు. ఉన్నతాధికారుల ఇష్టానుసారంగా కాకుండా మ్యాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించి.. ఏ జిల్లా ఎంచుకోవాలనేది ఉద్యోగులకు అవకాశం ఇచ్చి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రుణమాఫీపై అయోమయం

» బ్యాంకులకు వెళ్లి రైతుల ఆరా



మేడ్చల్, జూలై 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రుణమాఫీపై రైతులు అయోమయానికి గురవుతున్నారు. వాటికి సమాధానం చెప్పే వారు లేక రైతులు బ్యాంకర్ల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. రుణమాఫీ చేయడానికి వీలుగా ప్రభుత్వం రూపొందించిన ఉత్తర్వుల మేరకు పట్టాపాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు తొలివిడతలో రూ.లక్ష వరకు మాఫీ డబ్బులు జమకావాలి. కానీ బ్యాంకులు పంపిన జాబితాలో ఉన్న రైతుల్లో చాలా మందికి మాఫీ సొమ్ము జమకాకపోవడంపై గందరగోళం నెలకొంది. ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు కుటుంబం మొత్తం తీసుకున్న పంటరుణం లక్షకు పైగా దాటి ఉన్న రైతులకు తొలి విడత జాబితాలో చోటు దక్కలేదు. 2018 డిసెంబరు 12 నుంచి మంజూరైన, రెన్యువల్ అయిన రుణాలకు 2023 డిసెంబరు 9 వరకు బకాయి ఉన్న పంట రుణాలకు సంబంధించిన వివరాలను ప్రభుత్వం బ్యాంకర్లను కోరింది. రైతులు తీసుకున్న పంట రుణమాఫీ అవుతుందా? లేదా..? అసలు, వడ్డీ కలిపి ఎంత ఉందనే సమాచారాన్ని సైతం బ్యాంకులు రైతులకు ఇవ్వడం లేదు. అడిగితే చెప్పడం లేదని రైతులు అంటున్నారు. జిల్లాలోని పూడూరు, ఘట్‌కేసర్, అల్వాల్ సొసైటీలకు చెందిన రైతులకు ఆడిట్ కారణంగా ఇంకా రుణమాఫీ కాలేదు. పూడూరు సొసైటీలో 114, ఘట్‌కేసర్ సొసైటీలోని 1190, అల్వాల్ సొసైటీలోని 1400 మంది రైతులకు రుణమాఫీ కాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అధికారులు మాత్రం ఆడిట్ పూర్తయ్యే వరకు వారి ఖాతాల్లో నిధులు జమకావని చెబుతున్నారు. రుణమాఫీకి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు వీలుగా వ్యవసాయ విస్తరణ అధికారులు, వ్యవసాయాధికారులు పరిశీలించేందుకు ఆన్‌లైన్‌లో యాక్సెస్‌కు అవకాశం ఇచ్చారు. రూ.లక్షలోపు ఉండి రుణమాఫీ రాని రైతులు ఎందుకు రాలేదనే విషయాన్ని తెలుసుకోవచ్చని ఆధార్ నెంబరు చెబితే సరిపోతుందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావద్దని వ్యవసాయాధికారులు అంటున్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతం బాధ్యత మనదే

» ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి



మాట్లాడుతున్న పర్వత్ రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జూలై 21 : పాఠశాలలను బలోపేతం చేసే బాధ్యత ఉపాధ్యాయులదేనని ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పర్వత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కాచిగూడలోని ఎస్టీయూ భవన్‌లో ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అని అన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్నదని, విద్యారంగ ప్రమాణాలు పెంచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్టీయూ ఉపాధ్యాయుల హక్కులను పరిరక్షించిందని, అనేక సమస్యలు సాధించిందన్నారు. అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, ఎంఈవో, డిప్యూటీ డీఈవో పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడుతానని అన్నారు. సమస్యల సాధనకు సంఘాలన్నీ కలసిరావాలని పిలుపునిచ్చారు ప్రస్తుత విద్యారంగంలోని అనేక సమస్యలను ప్రస్తావించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్‌లో ఉన్న బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం పట్ల ప్రభుత్వానికి అభినందనలు తెలియజేశారు. ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, బదిలీ అయి రిలీవ్ కాని టీచర్లను ప్రత్యామ్నాయ పద్ధతులతో వెంటనే రిలీవ్ చేయాలని, పెండింగ్‌లో ఉన్న అన్ని డీఏలను సత్వరం విడుదల చేయాలన్నారు. ప్రతీ పాఠశాలలో సర్వీస్ పర్సన్లను నియమించి పాఠశాల పరిశుభ్రతను కాపాడాలన్నారు. 40 శాతం ఫిట్ మెంట్‌లో నూతన పీఆర్సీని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పదోన్నతులు, బదిలీలు పొందిన ఉపాధ్యాయులను సత్కరించారు. రాష్ట్ర కార్యదర్శి సదానందం గౌడ్, జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి సత్తు పాండు రంగారెడ్డి, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, వీరమణి, రాజమణి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఏవీ సుధాకర్. రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాతంగి, జిల్లా ఆర్థిక కార్యదర్శి బాల నర్సింహులు, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయం వద్ద వివరాలను వెల్లడిస్తున్న ఉద్యోగులు

సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయండి

తాండూరు, జూలై 21: విద్యాశాఖలో సమగ్రశిక్షాలో కాంట్రాక్ట్ పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యేను కలిసేందుకు వెళ్లగా అందుబాటులో ఎమ్మెల్యే లేకపోవడంతో అక్కడి ఉద్యోగులకు వినతిపత్రాన్ని అందజేసి వివరాలను అందజేశారు. సమగ్రశిక్షా ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని, అప్పటి వరకు బేసిక్ పే కల్పించాలన్నారు. జీవితబీమా రూ.10లక్షలు, ఆరోగ్యబీమా రూ.5లక్షలు సౌకర్యం కల్పించాలని పీటీఐలకు మిగతా ఎస్ఎస్ఏ ఉద్యోగుల మాదిరిగానే 12నెలల వేతనం ఇవ్వాలని, ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.20లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో ఎమ్మెల్యేను కలిసి డిమాండ్లను ప్రభుత్వం వద్ద చర్చించాలని కోరుతామని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జేఏసి వర్కింగ్ ప్రెసిండెంట్ ఎస్.మోహన్ సింగ్, అధ్యక్షుడు కె.గంగ్యానాయక్, మహిళ విభాగం అధ్యక్షురాలు డి.స్వప్నరెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డు

ఘట్‌కేసర్, జూలై 21: రాష్ట్రంలో ఆటో కార్మికుల సంక్షేమానికి ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కల్లూరి జయచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్‌లో ఏఐటీయూసీ అనుబంధ ఆటోయూనియన్‌ను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఆటో కార్మికులకు ప్రతీనెల ప్రభుత్వ ఇస్తానన్న రూ.12,500భృతిని చెల్లించి వారి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కృష్ణమూర్తి, శ్రీనివాసులు, లొట్టి ఈశ్వర్, యాకుబ్‌పాషా, జంగయ్య, మంకయ్య, నరేష్, నవీన్, నర్సింహ, షైసయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్/కొడంగల్ రూరల్/బొంరాస్‌పేట్/పూడూరు/కులకచర్ల/పెద్దేముల్, జూలై 21: రైతుబీమాకు జూన్ 28, 2024 నాటికి ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల వివరాలు మండల వ్యవసాయశాఖకు అందినట్లు ఏవో ఎంఏ బాసిత్ కొడంగల్, బొంరాస్‌పేట్ మండలాల వ్యవసాయ శాఖ అధికారులు రాజురాథోడ్, అనురాధ, పూడూరు మండల వ్యవసాయాధికారి, కులకచర్ల ఏవో వీరస్వామి, పెద్దేముల్ మండల వ్యవసాయాధికారి నజీరుద్దీన్‌లు ఆదివారం వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. 2024-2025 సంవత్సరానికి గాను రూ.5లక్షల బీమా చేసుకోని రైతులు ఈ ఏడాది చేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల్లోపు గల రైతులు ఆగస్టు 5వ తేదీ లోపు సంబంధిత ఏఈవోలకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రైతుబీమా దరఖాస్తు ఫారం, పట్టాదారు పాసుబుక్, ఆధార్‌కార్డ్, నామినీ ఆధార్‌కార్డ్ జిరాక్స్‌లతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతుబీమాలో తప్పుల సవరణకు ఈనెల 30వ తేదీ వరకు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. గతంలో రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకున్న రైతులు ఇప్పుడు చేసుకోవద్దని సూచించారు. 14 ఆగస్టు 1965 నుండి 14 ఆగస్టు 2006 మధ్యలో జన్మించిన వారు మాత్రమే రైతుబీమాకు అర్హులని తెలిపారు.



పాంబండ గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

వైభవంగా పాంబండ గిరి ప్రదక్షిణ

కులకచర్ల, జూలై 21: మండలంలోని పాంబండ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. బండవెల్కిచర్ల పాంబండ శ్రీ రామలింగేశ్వరస్వామి ఆలయానికి ప్రతీ పౌర్ణమి రోజు ఇక్కడ హిందూ బంధువుల ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం వర్షం కురుస్తున్నా గురుపౌర్ణమి సందర్భంగా పాంబండ 19వ గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొని శ్రీ రామలింగేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా రాంబల్ నాయక్



కేశంపేట, జూలై 21: లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడిగా కేశంపేట మండలం ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామ పంచాయతీ పొడగుట్టతండాకు చెందిన రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు ముడావత్ రాంబల్ నాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు, ట్రైకార్ చైర్మన్ తేజావత్ బెల్లయ్య నాయక్ రాష్ట్ర కార్యకవర్గాన్ని హైదారాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం ప్రకటించారు. రాంబల్‌నాయక్‌ను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమిస్తూ 19 మందితో కార్యవర్గాన్ని ప్రకటించారు. 1997 నుంచి రాంబల్ నాయక్ లంబాడ హక్కుల కోసం పోరాటం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో లంబాడీల హక్కుల కోసం తండాలలో విస్తృత ప్రచారం నిర్వహించారు. తనను ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు జాతీయ అధ్యక్షుడు బెల్లయ్య నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. లంబాడీల హక్కుల సాధన కోసం మరింతగా పనిచేసే అవకాశం తనకు వచ్చినందుకు సంతోషం వ్యక్తం చేశారు.



విశ్వేశ్వర్‌రెడ్డి నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న నర్సింగ్‌రావు

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, జూలై 21: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలని చేవెళ్ల పార్లమెంటు సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. తనను భారీ మెజార్టీతో ఎంపీగా గెలిపించినందుకు ప్రత్యేక శ్రద్ధతో గ్రామాల్లో ప్రచారం చేస్తానని హామీ ఇచ్చారు. శనివారం రాత్రి మండల పరిధిలోని హిమాయత్ నగర్‌లోని బీజేపీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. కార్యక్రమానికి విశ్వేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలంతా సమిష్టిగా కృషి చేయడంతోనే తాను ఎంపీగా భారీ మెజార్టీతో గెలవగలిగానన్నారు. చేవెళ్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, హైదరాబాద్-బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ప్రారంభించేందుకు అధికారులపై ఒత్తిడి తీసుకువస్తానని తెలిపారు.

ఎస్సీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా నర్సింగ్‌రావు

శనివారం రాత్రి హిమాయత్ నగర్ చౌరస్తాలోని బీజేపీ కార్యాలయంలో జరిగిన రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సమావేశం జరిగింది. ఎస్సీ మోర్చా అభివృద్ధి, క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసే విషయమై నాయకులు చర్చించారు. అనంతరం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌కు చెందిన అంతంగారి నర్సింగ్‌రావును బీజేపీ రంగారెడ్డి జిల్లా ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పజెప్పిన పార్టీ పెద్దలకు నర్సింగ్‌రావు ధన్యవాదాలు తెలిపారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాష్, నస్‌వెళ్లి ప్రభాకర్‌రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, కిసాన్ మోర్చా జిల్లా నాయకులు మోర నర్సింహారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు

● ఆలయాల్లో భక్తుల తాకిడి ● సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు ● భక్తులకు అన్నదానం


ఘట్‌కేసర్ రూరల్: శివారెడ్డిగూడలోని సాయిబాబా దేవాలయంలో భక్తుల రద్దీ

వికారాబాద్, జూలై 21: గురుపౌర్ణమి పురస్కరించుకొని ఆదివారం సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. మునిసిపల్ పరిధిలోని గంగారం బాబా ఆలయంతో పాటు మండలంలోని ద్యాచారం సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయాల్లో భజన కార్యక్రమాలు నిర్వహించగా ద్యాచారం ఆలయంలో కుంచం సురేష్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించగా భక్తులు దైవప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయాల్లో భక్తుల సందడి కనిపించింది.

మర్పల్లి: గురుపౌర్ణమి సందర్భంగా మర్పల్లి మండల కేంద్రంలోని సాయిబాబా మందిరంతో పాటు సిరిపూరం, కురుగుంట గ్రామాల్లో ఆదివారం ఆలయాల్లో భక్తుల తాకిడి పెరిగింది. ఓ వైపువర్షం కురుస్తున్నా తెల్లవారుజామునే భక్తులు ఆలయానికి చేరుకొని సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మండలంలోని పట్లూర్, కోటమర్పల్లి, కొత్లాపూర్, పంచలింగాల, రావులపల్లి, సిద్ధపూర్, వీర్లపల్లి గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తుల దర్శనం కోసం ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

తాండూరు: గురు పౌర్ణమి వేడుకలు తాండూరు పట్టణంలో వైభవంగా జరిగాయి. ఆదివారం తాండూరు పట్టణ శివారు కొడంగల్ రోడ్డు మార్గంలో కొలువైన షిర్డి సాయిబాబా మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మహా నైవేద్యం సామూహిక పుష్పాభిషేకం, హారతి, దూప హారతి కార్యక్రమాలను ఆలయకమిటీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ ఉత్సవాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న పరిమళ్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిపూర్ బాల్‌రెడ్డి, ఆర్డీఓ మేనేజింగ్ డైరెక్టర్ సరళ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ శోభారాణి, మాజీ వైస్ చైర్‌పర్సన్ పట్లోళ్ల రత్నమాల, కౌన్సిలర్లు నీరజ ప్రభాకర్ గౌడ్, అంతారం లలిత, పట్లోళ్ల నర్సింహులు, కందుకూరి రాజ్‌కుమార్, మనోహర్, గాజుల వినోద్ కుమార్, మల్లప్ప, మాధవరెడ్డి, మల్లారెడ్డి, హనుమయ్య, సాయిలు, హన్మంత్‌రెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా సాయిపుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత శంకర్ యాదవ్, చంద్రకళ దంపతులు గురుపూర్ణిమను పురస్కరించుకొని సాయిబాబా మందిరం వద్ద అన్నదానం చేశారు. తాండూరు పట్టణం భద్రేశ్వర దేవాలయంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయిబాబా మందిరంలో పుష్పాభిషేకంలో పాల్గొన్నారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో..

మేడ్చల్ టౌన్: గురు పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మేడ్చల్ పట్టణంలోని షిర్డీ సాయిబాబా ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్ కోడలు క్షమితతో పాటు పలువురు ప్రముఖులు ఆలయంలో పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ వారు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేముల శ్రీనివాస్‌రెడ్డి, మర్రి నర్సింహారెడ్డి, శేఖర్‌గౌడ్, బాల్‌రెడ్డి, సత్యనారాయణ, బూషి సంతోష్ గౌడ్, బీజేపీ నాయకులు జాకట ప్రేమ్ దాస్, శ్రీనివాస్‌గౌడ్, లవంగ శ్రీకాంత్, వంశీవిజయ్ తదితరులు పాల్గొన్నారు.


వికారాబాద్: ద్యాచారంలో అన్నదానం చేసిన కుంచం సురేష్ దంపతులకు సన్మానం


వికారాబాద్: ద్యాచారం ఆలయంలో భక్తుల భజన కార్యక్రమాలు

మేడ్చల్, (ఆంధ్రజ్యోతి): మేడ్చల్‌లోని దత్తాత్రేయుడు సాయిబాబా, గురు రాఘవేంద్రస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, అర్చనలు, సామూహిక పారాయణం చేసి గురువు యొక్క గొప్పతనాన్ని చాటారు.

ఘట్‌కేసర్: గురుపూర్ణిమ సందర్భంగా ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల్లోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రధానంగా సాయిబాబా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని శివారెడ్డిగూడలోని సాయిబాబా ఆలయం, ఎన్ఎఫ్‌సీ నగర్, బాలాజీనగర్, కొండాపూర్, పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడలలోని సాయిబాబా ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈసందర్భంగా ప్రత్యేక హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అన్ని ప్రధాన ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఘట్‌కేసర్ రూరల్: ఘట్‌కేసర్ మండలంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఎదులాబాద్ శ్రీ సాయినిలయంలో ఉదయం సాయిబాబా ఆలయాన్ని పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు, మంగళహారతులు సమర్పించారు. ఆలయ పూజారి కుమారశర్మ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. సాయంత్రం గ్రామంలో పల్లకీసేవలో బాబాను ఊరేగించారు. ఆలయ ధర్మకర్తలు కాలేరు సురేందర్, కాలేరు నవీన్, భక్తులు కుమార్, గుమ్మడి దుర్గేష్, సత్యనారాయణ, రవి, రాజేష్ పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపాలిటీల పరిధిలోని సాయిబాబా ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. భక్తులు వేకువ జామునే ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా విగ్రహానికి అభిషేకాలు, హోమాలు, అన్నదానాలు నిర్వహించారు. నాగారంలో భాగ్యనగర్ బాలగోకులం ఆధ్వర్యంలో గురుపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రఖ్యాత పురాతత్వ శాస్త్రవేత్త డాక్టర్. ఎంఎం రావు పాల్గొన్న గురుపూజ ప్రాశస్త్యాన్ని వివరించారు. నాగారం మున్సిపాలిటీ పరిధి రాంపల్లిలోని సాయిసేవాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపౌర్ణమి వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

శామీర్‌పేట: మండల కేంద్రం శామీర్‌పేటలోని శ్రీ సాయి ముక్తిదామంలో ముక్తానంద స్వామిజీ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు సామూహిక శ్రీ సత్యనారాయణస్వామి వత్రాలను నిర్వహించారు. శామీర్‌పేటలోని శ్రీ భవాణిరామ లింగేశ్వరస్వామి ఆలయంలోని సాయిబాబాకు ఆలయ ప్రధానార్చకులు మురళీధర్‌శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శామీర్‌పేట మండలంలోని తూంకుంట, అలియాబాద్, పొన్నాల్, మురహరిపల్లి పరిధిలోని సాయిబాబా ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా భక్తులు బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. శ్రీసాయి ముక్తిదామంలో జరిగిన పూజల్లో వివిధ పార్టీల నాయకులు బాబాకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అలియాబాద్‌లో గ్రామపెద్దలు, భక్తులు బాబాకు ప్రత్యేకపూజలు చేశారు.

గురువు ప్రణవ స్వరూపం

వికారాబాద్, జూలై 21: గురువు ప్రణవ స్వరూపమని సీనియర్ అడ్వకేట్ గోపాల్‌రెడ్డి తెలిపారు. గంగారంలోని సత్యసాయి జ్ఞాన కేంద్రంలో గురుపౌర్ణిమ ఉత్సవాలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. జీవులు మానవజన్మ పొందడం దుర్లభమని అది సద్గురు ద్వారా సాధ్యమవుతుందని తెలిపారు. మనిషి కోపాన్ని వదిలి గురువు ద్వారా సాధన చేసి ఆత్మజ్ఞానం పొందాలని చెప్పారు. వక్త విశ్వ హిందూ పరిషత్ ప్రధాన కార్యదర్శి పాల్గొన్న శ్రీలతారెడ్డి వికారాబాద్ జిల్లా మాట్లాడుతూ.. జీవితం విలువైనదని, సత్యంగా ప్రియంగా ప్రేమగా మాట్లాడాలన్నారు. ఎవరినీ బాధించరాదని మనిషి ధర్మం తప్పరాదని వ్యాసునిలా విశాల దృష్టి కలిగి ఉండాలని తెలిపారు. జిల్లా సత్యసాయి సంస్థల ఆధ్యాత్మిక సమన్వయకుడు బంధప్పగౌడ్ మాట్లాడుతూ.. గురువు అంటే ఆధ్యాత్మిక జ్ఞానం అందించేవాడని, మనకు నాలుగు వేదాలను మహాభారతాన్ని, భగవద్గీతను, అష్టాదశ పురాణాలను, విష్ణు సహస్రనామాన్ని అందించారని ఈరోజు వ్యాసున్ని పూజిస్తే మోక్షాన్ని పొందడానికి అర్హులవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యనారాయణగౌడ్, బసవేశ్వర్, వేణుగోపాల్, విఠోబా, నరసింహులు, సేవాదళ్ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వక్త శ్రీలతారెడ్డి

ప్రతీఒక్కరూ నిత్య విద్యార్థులే

ఈ సృష్టిలో ప్రతీఒక్కరు నిత్య విద్యార్థులేనని సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా సంస్కారభారతి ఆధ్వర్యంలో సిద్ధార్థ పాఠశాలలో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కారభారతి ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో నైపుణ్యం గల గురువులను సన్మానించారు. అనంతరం గురువులు మాట్లాడుతూ.. ఇది గురువులకు కృతజ్ఞత చెప్పుకునేందుకు జరుపుకునే పండుగ అని అన్నారు. సనాతన హైందవ ధర్మంలో తల్లి, తండ్రి తర్వాత స్థానం గురువుకే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్కారభారతి రాష్ట్ర కార్యదర్శి సి.వేణుగోపాల్ రావు, జిల్లా కార్యదర్శి సురేష్, పట్టణ అధ్యక్షుడు తలారి ప్రభాకర్, విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంస్కార భారతి జిల్లా అధ్యక్షులు గొడుగు శ్రీనివాస్

తాండూరు: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) ప్రాంతీయ కార్యాలయంలో భగవాన్ వేదవ్యాసుని జయంతిని పురస్కరించుకొని వారి చిత్రపటానికి పూలమాల వేసి గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మీకాంత్‌రావు, ఉపాధ్యాయ సంఘం నేతలు జిల్లా మిడియా కన్వీనర్ గాజుల బస్వరాజ్, జిల్లా బాధ్యతలు నరహరిరెడ్డి, తాండూరు నియోజకవర్గ కన్వీనర్ ఆకుల శ్రీశైలం, సిద్దిరామేశ్వర్ పాల్గొన్నారు.


మేడ్చల్ టౌన్: సాయిబాబా ఆలయానికి విచ్చేసిన డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి


ఘట్‌కేసర్ రూరల్: ఎదులాబాద్‌లోని శ్రీసాయినిలయంలో భక్తులు, ఆలయ ధర్మకర్తలు

మర్పల్లి: పిల్లలతో కలిసి సాయిబాబాను దర్శించుకున్న మహిళ



కీసర రూరల్: రాంపల్లిలో సాయిబాబాను దర్శించుకున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పూడూరు, జూలై 21: మండలంలోని బీజాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారి మార్గంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆదివారం జాతీయ రహదారి పక్కన గల మిర్జాపూర్ గేటు సమీపంలోని మార్గంలో వెళుతున్న కొందరు ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అతడి మృతికి గల కారణాలను సేకరిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

బొంరాస్‌పేట్, జూలై 21: రేగడి మైలారం గ్రామానికి చెందిన నర్యానాయక్ ఇటీవల తన ఫోన్ పోగొట్టుకోగా బొంరాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఈఐఆర్ యాప్ ద్వారా ట్రెస్ చేసిన పోలీసులు పోగొట్టుకున్న ఫోన్ దొరకడంతో ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో నర్యానాయక్‌కు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ అప్పగించారు.



పోగొట్టుకున్న ఫోన్‌ను అప్పగిస్తున్న ఎస్ఐ అబ్దుల్ రవూఫ్

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

కులకచర్ల, జూలై 21: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్న పలువురు బదిలీ అయ్యారు. గత రెండు రోజులుగా వికారాబాద్‌లో నిర్వహించిన కౌన్సిలింగ్‌లో మండల వ్యాప్తంగా 16 మంది బదిలీ అయినట్లు అధికారులు తెలిపారు. తిరుమలాపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ పరిగి మండలం నారాయణపూర్‌కు, సాల్విడ్ కార్యదర్శి రాజు పూడూరు మండలం మేడికొండ, ఇప్పాయిపల్లి కార్యదర్శి శ్రీను పరిగి మండలంలోని రాపోలుకు, చాకల్‌పల్లి కార్యదర్శి విజయలక్ష్మిబ ఎత్తుకాల్వ తండాకు, చెరువు ముందలి తండా(కే) కార్యదర్శి రాఘవేందర్ పరిగి మండలం రుక్కుపల్లికి, లాల్‌సింగ్ తండా కార్యదర్శి రమాదేవి పరిగి మండలం గోవిందాపూర్‌కు, గోగ్యానాయక్ తండా కార్యదర్శి శివకుమార్ పరిగి మండలంలోని ఇబ్రహింపూర్‌కు, బొట్యానాయక్ తండా కార్యదర్శి విజయ్‌కుమార్ దోమ మండలం ఊటుపల్లికి, ఎర్రగోవింద్ తండా కార్యదర్శి సాహెరాబేగం దోమ మండలం శివారెడ్డిపల్లికి, బండమీదితండా కార్యదర్శి వెంకటేశ్ దోమ మండలంలోని గుండాల్‌కు, బాజ్యానాయక్ తండా కార్యదర్శి ఆనంద్ దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్‌కు, విఠలాపూర్ కార్యదర్శి చంద్రకల‌కు, అనంతసాగర్ కార్యదర్శి జమీరుద్దీన్ దేవరఫస్లాబాద్‌కు, హన్మ్యానాయక్ తండా కార్యదర్శి శోభారాణి గుండుమాల్‌కు, వల్యానాయక్ తండా కార్యదర్శి అనసూయ బషీరాబాద్ మండలం మాసాయిపల్లికి బదిలీ అయ్యారు.

సానిటరీ ఇన్‌స్పెక్టర్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ బదిలీ

తాండూరు/బషీరాబాద్: తాండూరు మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ విక్రమసింహారెడ్డి బదిలీ అయ్యారు. తాండూరు నుంచి జహీరాబాద్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. ప్రసుత్తం ఈయన ఇన్‌చార్జి కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ఈయన స్థానంలో ఎవరినీ నియమించబడలేదు. తాండూరు మున్సిపాలిటీలో నలుగురు జూనియర్ అసిస్టెంట్లు, కిష్టయ్య(కృష్ణయ్య), అనంతయ్య, శ్రీనివాస్, నీరటి శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ వై.జంగయ్య, బిల్ కలెక్టర్ ఆకాష్‌లు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో వికారాబాద్ మున్సిపాలిటీ నుంచి జూనియర్ అసిసెంట్లు వి.గోపాల్, సంగమేశ్వర్, బిల్‌కలెక్టర్ కపిల్‌కుమార్, సతీష్ కుమార్‌లు తాండూరు మున్సిపాలిటీకి వస్తున్నారు. అదేవిధంగా బషీరాబాద్ డిప్యూటీ తహసీల్దార్ వెంకటయ్య, ఆర్ఐ రాకేష్, ఏఎంఆర్ఐ శివాణి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా వీరికి స్థాన చలనం కలిగింది. డిప్యూటీ తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ హైదరాబాద్ జిల్లాకు బదిలీ కాగా, ఏఎంఆర్ఐ సంగారెడ్డి జిల్లాకు బదిలీపై వెళ్లనున్నారు. ఈమేరకు అధికారులకు బదిలీ ఉత్తర్వులు అందాయి.

కారంచేడు ఘటన సమాజానికి మాయని మచ్చ

ఘట్‌కేసర్, జూలై 21: కారంచేడు ఘటన సమాజానికి మాయని మచ్చ అని మహిళా న్యాయవాది శిరీష అన్నారు. ఘట్‌కేసర్‌లో ప్రబుద్ధ భారత్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అంబేడ్కర్‌కు నివాళి కార్యక్రమంలో స్థానిక ఎదులాబాద్ చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కారంచెడు ఘటనకు నేటితో 39సంవత్సరాలు పూర్తయినట్లు గుర్తు చేశారు. పలువురు దళితులను కిరాతకంగా హత్యచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మౌనం పాటించి కారంచేడు అమరులకు నివాళులర్పించారు. నాటి అమరుల పోరాట పటిమను ముందుకు తీసుకెళ్లడానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మీసాల అరుణ్‌కుమార్, దాసు నర్సింగరావు, శ్రీనివాస్, అంజయ్య, గణేష్, ప్రవీణ్, సాయిచరణ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తున్నా'

వికారాబాద్, జూలై 21: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకేమునిసిపల్ కార్మికులు రెండు పూటలు విధులు నిర్వర్తించాలని పనిచేయిస్తున్నట్లు మునిసిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బి.ఏసుదాసు ఒక ప్రకటనలో తెలిపారు. పనివేళలు నచ్చని ఒకరిద్దరూ తనపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తమ ఇంట్లో ఉండేదే ముగ్గురమని మేము ఆరుగురితో పనిచేయించుకుంటున్నామని అనడం సిగ్గుచేటని పేర్కొన్నారు. తనపై ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్న నాయకుడు గతంలో తనను డబ్బులు డిమాండ్ చేశాడని, అందుకు ఒప్పుకోలేదని కార్మికులతో తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాడని పేర్కొన్నారు. వర్షాకాలం కారణంగా సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ఉండేందుకు పట్టణ ప్రజలకు ఉన్నత సేవలు అందించడానికి మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్, కమిషనర్ జాకీర్ అహ్మద్‌లు ఎల్లవేళలా కృషి చేస్తున్నారని తెలిపారు.

నేటి నుంచి తొమ్మిదికే బడిగంట

మేడ్చల్, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల వేళల్లో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల సమయాలను సవరించింది. గతేడాది అన్ని పాఠశాలలు ఒకే సమయానికి(9.30)కి ప్రారంభంకావాలని ఉత్తర్వులిచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు గతంలో సవరించిన సమయానికి అరగంట ముందుగా ఉదయం 9.00గంటలకు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులో పేర్కొంది. ఇకపై అన్ని పాఠశాలల్ని ఉదయం 9గంటలకు ప్రారంభించి, ప్రాథమిక పాఠశాల సాయంత్రం 4వరకు, ప్రాథమికోన్నత, ఉన్నత బడులు మాత్రం 4.05గంటల వరకు కొనసాగించాలని నిర్ణయించారు. బడివేళల్లో మార్పులు సోమవారం నేటి నుంచి అమల్లోకి వస్తాయని డీఈవో విజయకుమారి తెలిపారు.

భవిష్యత్తు అంతా ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే

ఘట్‌కేసర్ రూరల్, జూలై 21 : రాబోవు కాలమంత అర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)దేనని ఐజీటీ కాన్పూర్ ప్రొఫెసర్ ఓం అశిష్ మిశ్రా తెలిపారు. మండలంలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో ఆదివారం ఏఐ విభాగంలో ఆధ్వర్యంలో నిర్వహించిన డీఎల్ఎస్ఏసీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅథితిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు ఏఐపై పట్టుసాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐ హెచ్‌వోడీ మల్లికార్జున్‌రెడ్డి, మనోరంజన్ దాస్, అర్చన, రాజేశ్వర్ పాల్గొన్నారు.


కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు

వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నాం

వికారాబాద్, జూలై 21: ఆధునిక పోటీ ప్రపంచంలో వాహనదారులకు, వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంలో ఎక్సైడ్ బ్యాటరీ సంస్థ ఇతర సంస్థల కంటే ముందున్నదని ఆ సంస్థ డిస్ట్రిబ్యూటర్స్ హెడ్ నాగరాజు అన్నారు. సత్యభారతి ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎక్సైడ్ మెకానిక్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. అత్యధిక వారెంటీ గల బ్యాటరీలు అందించడంలో ఎక్సైడ్ సంస్థ నెంబర్ వన్ స్థానంలో నిలుస్తుదని అన్నారు. ఈ సందర్భంగా స్థానిక అయ్యప్ప ఎక్సైడ్ బ్యాటరీ డీలర్ జొన్నల రవిశంకర్ ఆ సంస్థ డిస్ట్రిబ్యూటర్స్ హెడ్ నాగరాజు, సేల్స్ ఆఫీసర్ భాస్కర్, చీఫ్ మెకానిక్స్ సురేష్, సోహెల్, మెకానిక్‌లు, బ్యాటరీ ఎలక్ట్రీషియన్లను సన్మానించారు.


ఎక్సైడ్ బ్యాటరీ మెకానిక్స్ మీట్‌లో మెకానిక్‌లను సన్మానిస్తున్న రవిశంకర్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


పుట్టపహాడ్‌లో సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కులకచర్ల, జూలై 21: మండలంలోని పుట్టపహాడ్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక గురుకృప ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, అంజిలయ్యగౌడ్, ప్రభాకర్‌రెడ్డి, అనంత్‌రెడ్డి, కేశవులు, బాల్‌రాజుకు విద్యార్థులు పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా ముప్పై సంవత్సరాల తర్వాత ఒకే దగ్గర కలుసుకోవడంతో పూర్వ విద్యార్థులు అప్పటి మధురజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో రమేశ్, గురునాథ్‌రెడ్డి, వెంకట్‌రాములు, విష్ణు, మహేశ్, స్వర్ణలత, హైమావతి, నిర్మల పాల్గొన్నారు.

తండాలో తీరిన తాగునీటి సమస్య

బొంరాస్‌పేట్, జూలై 21: మండలంలోని గడ్డమీది తండాలో గత కొన్ని రోజులుగా తాగునీటి సమస్య నెలకోవడంతో తండావాసులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి స్పందించి తండాలో నూతన బోరు మోటార్‌ను వేయించినట్లు తండావాసులు తెలిపారు. ఈ సందర్భంగా తండా వాసులు తిరుపతిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.


తండాలో వేసిన నూతన బోరు

శాకాంబరిగా రాజరాజేశ్వరీ అమ్మవారు

ఘట్‌కేసర్, జూలై 21: అషాడ మాసం సందర్భంగా ఘట్‌కేసర్ పరిధిలోని శివారెడ్డిగూడలోని శ్రీదండ్లగడ్డ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో కొలువుదీరి ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరీగా అలంకరించారు. గురుపూర్ణిమ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



అమ్మోర్లకు బోనాలు


గుండ్లపోచంపల్లిలో బోనంతో అమ్మవారి ఆలయానికి బయల్దేరుతున్న స్థానిక నేతలు

మేడ్చల్ టౌన్, జూలై 21: గుండ్లపోచంపల్లి మున్సి పాలిటీలో ఆదివారం మహంకాళి, మైసమ్మ అమ్మవార్ల బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు అమ్మవారికి బోనాలు సమర్పించుకున్నారు. స్థానిక నాయకులు రాజకీయాలకు అతీతంగా బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. మహిళలు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవార్లకు బోనాలు సమర్పించుకున్నారు. యువకులు డప్పులతో ఫలహారం బండ్ల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, బేరి బాల్‌రాజ్, హేమంత్ రెడ్డి, నాయకులు మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్ గౌడ్, సంజీవ గౌడ్ పాల్గొన్నారు.

పరిగి: పరిగి మునిసిపల్ పరిధిలో ఆదివారం మైసమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాన్ని వైభవంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రదక్షిణలు చేశారు. అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

శామీర్‌పేట: మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఆదివారం ఎంతో ఆనందోత్సవాలతో అమ్మవార్ల బోనాల ఉత్సవాలను జరుపుకున్నారు. ఆ గ్రామాల మహిళలు, యువతులు ఎంతో ఉత్సాహంగా బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవార్లకు సమర్పించారు. శామీర్‌పేట, మజీద్‌పూర్, అలియాబాద్, బాబాగూడ, బొమ్మరాసిపేట, పొన్నాల్ గ్రామాల్లో జరిగిన అమ్మవార్ల బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైఎస్‌గౌడ్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ ప్రచార కమిటీ చైర్మన్ రాంచందర్‌యాదవ్, నాయకులు మహేందర్ యాదవ్, తదితర నాయకులు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాల్లోని నల్లపోచమ్మ, మహంకాళమ్మ, మైసమ్మ, దుర్గమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్ల ఆలయాలకు వెళ్లి భక్తిశ్రద్ధలతో దర్శించుకుని మొక్కులను తీర్చుకున్నారు.


పరిగిలో బోనాల ఉత్సవాలు


శామీర్‌పేటలో బోనాలతో ఆలయానికి చేరుకుంటున్న భక్తులు

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

ఘట్‌కేసర్, జూలై 21: కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పోచారం మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. ఆయన ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ, వెంకటసాయినగర్ కాలనీల్లో మార్నింగ్ వాక్ నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటసాయి నగర్‌లో రూ.20లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. అన్నికాలనీల్లో డ్రైనేజీలు, సీసీ, బీటీ రోడ్ల పనులు చేపట్టినట్లు గుర్తు చేశారు. వీధుల్లో చెత్త వేయొద్దని, పరిసరాలను కలుషితం చేయకుండా మున్సిపల్ సిబ్బందికి సహకరించాలన్నారు.


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న కొండల్‌రెడ్డి

రుణమాఫీ చేయడం హర్షణీయం

మోమిన్‌పేట్, జూలై 21: కాంగ్రెస్ ప్రభుత్వ రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు బుచ్చిరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతు రుణమాఫీ చేయడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న మాజీ మంత్రి హరీశ్‌రావు మాటకు కట్టుబడి ఉండాలన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి


హుండీలను కీసరగుట్ట ఆలయ నిర్వాహకులకు అందజేస్తున్న జ్ఞానేశ్వర్‌గుప్తా

కీసర, జూలై 21: కీసరగుట్ట ఆలయ అభివృద్ధికి దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ అన్నారు. బాట సింగారం వాస్తవ్యులు జ్ఞానేశ్వర్ గుప్తా రూ.70వేలు విలువచేసే మూడు హుండీలను ఆదివారం ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం శర్మ మాట్లాడుతూ.. మహిమాన్విత క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సుధాకర్, ప్రధాన అర్చకుడు బలరాం శర్మలతో పాటు జ్ఞానేశ్వర్ గుప్తా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.